# సీత

తల గిర్రున తిరిగినట్ల యింది. పడిపోతున్నాననుకున్నాను. చీర జారి కిందపడ్డట్టుగా కిందపడ్డాను.

ఇది నదీతీరం. ప్రశాంతమైన స్థలం. చెట్టూ చేమా, నేలా నింగి— ఉగ్రత్వం లేకుండా వుంటాయి. గాలులు మృదువుగా వీచుతాయి. కొండలు గంభీరంగా సర్వసాక్షిగా చూస్తూ తపస్సు చేస్తున్నట్లుంటాయి, అన్న స్పృహే లేదు నాకు అప్పుడు. కన్నులు చూడలేవు. చెవులు వినలేవు. శరీరం నిలపగల శక్తి లేనిదయింది. పడిపోయాను.

గత జీవితం కన్నులముందు చిత్రపటంలాగ కనబడింది జరుగుతూ.

మిధిలలో పెరగడం, నాన్నగారిమాటలు, మెల్లగా చల్లగా మాట్లాడే నాన్న గంభీరవాణి వినబడింది. శివధనుస్సుతో ఆటలాడరావమ్మా, అన్న వారి మాట వినబడింది.

పెళ్ళి సందడి.

హరధనుస్సును విరిచినవాడు నా భర్త. అంత పరాక్రమవంతుడు, భర్తగా వచ్చాడు. రాజర్షి నా తండ్రి ఆ పరాక్రమశాలికి, మహావీరుడికి నన్ను కన్యాదానం చేస్తున్నారు.

కాపురం.

అత్తమామలు, అడుగులకు మడుగులొత్తే దాసీలు. నా మాట వింటే చాలు, నన్ను చూస్తే చాలు, నేను దగ్గర వుంటే చాలు- మూడు లోకాల నైనాసరే- తృటిలో జయించగలననే ధీమాగల భర్త- శ్రీరామచంద్ర మూర్తి.

పట్టాభిషేకం. పట్టాభిషేకం కాస్తా వనవాసంగా మారడం.

అ-బ్బ.

రేపు మిమ్మల్ని మహారాణిని చేస్తారు. రేపే పట్టాభిషేకం అని విన్నప్పుడు-నిజం-నా మనస్సు ఎగిరిగంతేసింది. పరవశం చెందింది. మహారాణీని అయిపోతున్నానని కొంచెం సేపు—తెలీని సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాను.-తప్పు.

మళ్ళీ —

నిన్న - తప్పు చేశాను.

"సీతా నీవిప్పుడు చూలాలివి, ఏం కావాలో చెప్పు, ఏంకోరినా సరే— నీ కోరిక తీరుస్తాను." అని శ్రీరామచంద్ర మూర్తి, రామప్రభువు అన్నారు.

లోకాధినాధుడు నా భర్త, లోకైక మహారాణిని నేను. అని మళ్ళీ - సంతోష పడ్డాను: క్షణకాలం వెర్రి సంతోషం పడ్డాను.

పొరపాటు —

మరోసారి గూడా యిలాగే తప్పు చేశాను.

లంకానగరంలో, అశోకవనంలో వున్నప్పుడు, మహాయుద్ధం జరుగుతూన్నప్పుడు, వాడు, ఆ మాయలమారి ఇంద్రజిత్తు గూడా హరుడైనాడన్నప్పుడు-ఇలాంటి తప్పుచేశాను.

నాకోసం, నాకోసం యీ రామరావణ మహాయుద్ధం జరుగుతోంది. నా భర్త—జగదేక శూరుడు, నాకోసం, యుద్ధం చేస్తున్నారనుకున్నాను. తప్పు. బుద్ధి తెలిశాక-వయస్సు వచ్చాక-తెలిసి, తెలియక చేసిన తప్పులు — యీ మూడే.

అందుకే యీ శిక్షలు నేను అనుభవించాలిసింది, కాబోలు. ధర్మ సభనుంచి, అంతఃపురానికి శ్రీరామచంద్రులు వచ్చారు. రధంకాచుకుని ఉంది, 'పురోధ్యానాలకు వెళ్ళివద్దాము' అన్నారు.

అలాగే, మీ యిష్టం అన్నాను. వెళ్ళాం. పొద్దుపోయి తిరిగి వచ్చాం.

అప్పుడే వారిని నేను కోరిక కోరాను. గంగానది జ్ఞానప్రదాత్రి. గంగానదీ తీరం పరమ పవిత్రం, గంగానదీ తీరాన మునివాటికలు పరమ ప్రశాంతాలు. అక్కడక్కడ పెద్ద పెద్ద పర్ణశాలలు. చక్కగా అలికి ముగ్గులుపెట్టి-పూలతో అలంకరించి, గుమ్మాలకు ముందు బలులు ఉంచి, సర్వసముడై, చిల్లపెంకుల్నీ, రత్నాలనూ సమంగా చూచే మహామునుల పర్ణశాలలు చూడాలని వుంది. నన్ను కష్టకాలంలో ఆదరించి, ఆశ్రయమిచ్చి, ఆశీర్వదించిన మునిపత్నులనుగూడా చూడాలని వుంది అన్నాను.

శ్రీరామచంద్రమూర్తి సంతోషంగా నవ్వారు. "గురుమూర్తుల సన్నిధికి, శూన్యహస్తాలతో వెళ్ళగూడదు" అన్నారువారు. కన్నులెగరేశాను. "నేనూ అదే అనుకుంటున్నాను. మునిపత్నులకని చీరలూ, రత్నాలూ, ఆభరణాలూ తీసుకుని వెళతాను. వారితో ఒక్క రోజన్నా గడిపి వస్తాను" అన్నాను. 'శుభమస్తు' అన్నారు నా భర్త.

ఒళ్ళు తెలియని సంతోషం వచ్చి ఉప్పొంగాను. తెల్లవారి, మరిది వచ్చి— "వదినా— అన్నగారు మిమ్మల్ని గంగాతీరానికి తీసుకుపొమ్మన్నారు" అని విన్నవించాడు. తెలీకుండానే- గుండెలు అదిరినయ్. వారు రారన్నమాట.... అని చెప్పినట్లయింది. 'ఎప్పుడు ప్రయాణం' అన్నాను.

'మీ యిష్టం. రథం సిద్ధంగా వుంది' అన్నారు లక్ష్మణులు. వొస్తున్నానన్నాను. రథం ఎక్కి బయలుదేరాం.

ముందు జరగబోయేవి ఎప్పటికప్పుడు ఎవరో తెలియచెబుతూనే వుంటారల్లే వుంది. అయోధ్య అంతా ఏమిటో అలికేసినట్టువుంది. మునిపత్నులను చూడడానికి, వారితో ఒకటి రెండురోజులు గడిపి రావటానికి వెళుతున్నానని అనిపించనే లేదు. సుమంత్రుడు మామూలుగా రథం తోలుతున్నాడు. మరిది లక్ష్మణుడు ఏదో పరధ్యానంగా వున్నాడు. ఎటో చూస్తున్నాడు. రథంలో నేను ఒక్కర్తెగానైనాను. మాటా పలుకూలేదు. ముగ్గురం వున్నాం; ముగ్గురి మనస్సులూ మూడు విభిన్న లోకాలలో తిరుగుతూన్నట్లుంది.

గంగాతీరానికి వచ్చాము. మునుల పర్ణశాలలు దూరదూరంగా కనిపిస్తున్నయ్. నెమళ్ళ కూతలు ఒకొక్కప్పుడు భయంకరంగా వినిపిస్తున్నయ్. ఉన్నట్లుండి, మరిది లక్ష్మణుడు కళ్ళనీళ్ళు తుడుచుకుంటున్నాడు.

గంగాతీరం. ప్రశాంత ప్రదేశంలో రమ్మన్నా దుఃఖం రాదు. అదే మునుల విశేషం. మునుల సన్నిధిని, విచారపడి, దిగులుపడి, కన్నుల నీరు

పెట్టుకోడం సామాన్యంగా జరగదు. ఆ ప్రశాంతతలో, ఆ పూజ్యస్థలాలలో, దివ్యస్థలాలలో దిగులు అంటూ వెయ్యదు. లక్ష్మణుడు, మహా మహా ఆపదలు పైనబడుతున్నా చలించనివాడు, విచారం అనేది ఎరగనివాడు, కన్నుల నీరు తుడుచుకోడమా? ఆశ్చర్యంగా వుంది.

'వదినా....' అన్నాడు. వున్నట్లుండి, ఏడుస్తూ, నా పాదాలను పట్టుకున్నాడు. వెక్కి వెక్కి ఏడ్చాడు. నా గుండెలు పిండుకుని పోతున్నట్లయింది.

"ఏమయ్యా, ఏమిటి? ఎందుకిట్లాగైనావు...." అన్నాను. మరిది ఇంకా ఎక్కువగా ఏడ్చాడు. తనను తాను సంబాళించుకుంటున్నాడు.

శ్రీరామచంద్రమూర్తి క్షేమమేగద, అత్తలకు మరుదులకు క్షేమమేగద. ఎందుకు విచారపడతాడు?

అమ్మా.... ఏడుస్తున్నాడు. కళ్ళనీళ్ళు- మాట్లాడటం కష్టంగదా అప్పుడు. "అమ్మా, నీవు మహా పతివ్రతవు. నీ రక్షణవుండగా ముల్లోకాలా సుఖంగా వుంటాయి. నీవు తప్ప...." అన్నాడు.

"ఏమిటయ్యా, యీ ఉపద్రవం. యెందుకిట్లా ఏడుస్తావు?" అన్నాను. మాటలయితే అంటున్నానేగానీ—

"నాయనా, తపోభూములను చూడాలని అడిగాను. పంపారు. చూస్తున్నాము. సంతోషించవలసిన సమయంలో విషాదం ఎందుకయ్యా?" అన్నాను లక్ష్మణుడు తలవొంచుకున్నాడు.

'అన్నగారు యిట్లాగన్నారు....' అన్నాడు మరిది. "లోకాపవాదం ప్రబలంగా వుంది. లంకలో అంతకాలం వున్న సీతను రాముడు యింటికి తెచ్చుకున్నాడు. యింతే. రాజు నడిచింది ధర్మం. ఆహా... అన్నారుట

పౌరులు.... లోకాపవాద భయంవల్ల, మిమ్మల్ని శ్రీరామ ప్రభువు పరిత్య జిస్తున్నారు...." అన్నాడు అతను.

నాకు పై ప్రాణాలు పైనే పోయినట్లయింది. ఆనాడు తండ్రి మాట లకు తమ మహారాజ్యాన్నే వదిలివేశారు శ్రీరామప్రభువు. ఈనాడు లోకుల కోసం— తన యిల్లాలిని, నిండు చూలాలిని వదిలిపెడుతున్నారా? అనిపిం చింది. బతికి వున్నంతకాలమూ భరించవలసిందేనా యీ నిందను ?

ఎవడో మూర్ఖుడు, ఏదో అన్నారని, నన్ను వదులుకుంటారా ? ఆనాడు, లంకలో యుద్ధభూమిలో రావణకాష్టం దగ్గిర అంతమంది సన్ని ధిలో- అగ్నిప్రవేశం చేశానే- అ-బ్బ.

బతికి వున్నంతకాలమూ సీతమ్మ- యిల్లాగట అనే నిందను, నా త్రికరణశుద్ధిని శంకించే నిందను నేను భరించాలా? యిది లోకాపవాదమా, శ్రీరామచంద్రులకూ మనస్సులో వుందా? తల తిరిగిపోటం; నేను విడిచేసిన వస్త్రంలాగా పడిపోటమూ అయింది. ఎంతసేపు అట్లా పడివున్నానో తెలి యదు. లక్ష్మణుడు, ఏడుస్తూ, 'వదినా, వదినా' అంటున్నాడు.

ఎవరో ఏదో చెబుతున్నట్లయింది. స్పృహ వచ్చింది. ఐశ్వర్యం క్షీణిస్తూ అంతం అవుతుంది. మహోన్నత స్థితి పతనంతో అంతమవు తుంది. సమాగమాలు వియోగంతో అంతం అవుతాయి. జీవితం మరణంతో అంతమవుతుంది. మహావేదనతో యీ సత్యం నాకు అవగతం అయింది. అందుకే కాబోలు. మహామహులు, మునులు, రుషులు - పిల్లలమీద, భార్య మీద, మిత్రులమీద, ధనంమీద- అతి ప్రసంగం చెయ్యరు. బంధం ఏర్పడు తుందని కాబోలు. 'అమ్మా....' అన్నాడు లక్ష్మణుడు.

నా గుండె కొయ్యబారింది. 'ఏం నాయనా' అన్నాను.

అదుగో వాల్మీకుల ఆశ్రమభూమి, అంటున్నాడు అతను.

"నాయనా, నా మాట విను తండ్రీ...." అన్నాను. నా నాలిక పిడచ కట్టుకుని పోయినట్లయింది.

లక్ష్మణుడు తలవొంచుకుని, చేతులు దోయిలించి నుంచున్నాడు.

"నాయనా, శ్రీరామప్రభువుకు యీ నా మాటలను చెప్పు తండ్రీ. ఆనాడు, అంతమంది సన్నిధిలో- అగ్ని పరిశుద్ధనయినా, నన్ను యీనాడు, లోకాపవాదంవల్ల త్యజిస్తున్నారు. ఆ వంశానికి అదే ఉచితం. ఈ నింద నాయందున్న ఏ కోపావేశంవల్లా వచ్చిపడిందికాదు. నేను ఏ పాపమూ ఎరగను. జన్మజన్మాంతరాలలో చేసుకున్న పాతకాలకు ఫలితం, పరిపాకం యిది. నవ్వుతూ చేసిందాన్ని ఏడుస్తూనయినాసరే, అనుభవింపక తప్పదు.

మహారాజా, తమ దయవల్ల, మునిపత్నులను ఆశ్రయించుకుని వుంటూ నా జీవితాన్ని గడుపుతాను. కాని, తాము వుండగా, నేను మరొకర్ని శరణువేడడమే విశేషం.

అపవాదులను భరిస్తూ ప్రాణాలతో బతికి ఉండేకంటె, చచ్చిపోడం మేలు అనే అనిపిస్తోంది. కాని, గర్భవతిని. యిక్ష్వాకువంశాంకురాన్ని నేను కాపాడక తప్పదు.

ఆ చెంపెడు నీళ్ళూ పోసుకునేదాకా, సూర్యమండలాన్ని ఆ సూర్యమండలం మధ్య ఉండే పరమాత్మను చూస్తూ ధ్యానిస్తూ తపస్సు చేసుకుంటాను. మళ్ళీ జన్మ అంటూ వుండి, పుట్టడమే సంభవిస్తే, మీరే నా భర్త. అప్పుడైనా, వియోగం అంటూ వుండకుండుగాక. మహారాజులకు వర్ణాశ్రమాచారాలను పరిపాలించడం ధర్మం. భార్యనైన నన్ను మీరు విడిచిపెట్టారు. లోకంలో అందరు తపస్వినులను, చూచేటట్లయినా నన్ను చూడడం...." అన్నాను.

అలాగేనమ్మా అన్నాడు మరిది. నెమ్మదిగా బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. రథం కనిపించింది. రథం జెండా కనిపించింది.

రథం రేపిన ధూళి కనిపించింది. చివరికి శూన్యం కనిపించింది. పిచ్చిగా అటే చూస్తున్నాను.

'అమ్మా....' అన్నారు.

తల బరువుగా తిప్పి చూశాను. కవిగారు- వాల్మీకి. పిట్టన్ని ఎవడో క్రూరుడు హింస చేస్తేనే చూచి ఓర్చుకోలేనంతవారు, మెత్తని మనసు, తపస్వి.

'అమ్మా....' అన్నారు.

లేచి నమస్కరించాను. ఆ మహామునికి కన్నులు చెమ్మగిలి తడిసినయ్.

"తపశ్శక్తివల్ల తెలుసుకున్నానమ్మా.మహాసాధ్వివి. అతిశుద్ధచరితవు. నిన్ను మహారాజు శ్రీరామచంద్రుడు త్యజించాడు. నీకు శుభమవుతుంది. రా అమ్మా- నిశ్శంకగా, నా పర్ణశాలకు రా తల్లీ. నీ తండ్రి, రాజర్షి జనకుడూ నేనూ స్నేహితులం. నీ తండ్రి ఇంటికి నీవు వస్తున్నావు" అన్నారాయన. భోరున ఏడవాలనిపించింది. నిగ్రహించుకుంటున్నాను."లోకకంటకుడైన రావణుణ్ణి వధించి, ముల్లోకాలకు మంచి చేసినా, సత్యప్రతిజ్ఞుడైనా, గొప్పవాడైనా- నిష్కల్మషురాలవు నిన్ను త్యజించినందుకు, ఆ రాముడి మీద నాకు కోపం వుండనే వుంది...." అన్నారాయన. వారి పర్ణశాలకు చేరాను. తమసా నదిలో స్నానం, సూర్యోపాసన, మునికన్యలతో ముచ్చట్లతో కాలం గడుస్తూంది. శ్రావణమాసం, వర్షం పడుతోంది. రాత్రివేళ తల్లినైనాను. కవలపిల్లలు. బాలసూర్యబింబాలలాగున్నారు. పనివాళ్ళు పెరుగుతున్నారు. నన్ను విడవరు. ఎక్కడవున్నా, ఏం చేస్తున్నా, ఆడుకుంటున్నా, చదువుకుంటున్నా, విద్యలు నేరుస్తున్నా, అమ్మా అంటూ ఓ కన్ను నామీదనే వుంచేవాళ్ళు కుశుడూ, లవుడూనూ.

మహారాజు శ్రీరామచంద్రులు అశ్వమేధయాగం తలపెట్టారుట. మహా మహులకు, మహర్షులకు వార్తలు చేరినయ్. అందరూ వెళ్ళారు. కుశ లవులూ, గురువుగారితో సహా వెళ్ళారు. పెద్దవాళ్ళయినా పిల్లలు దగ్గిర లేకపోతే, ప్రాణాలు గిలగిలలాడినై. నిగ్రహించుకున్నాను. 'సమాగమాలు వియోగాంతాలు. జీవితం మరణంతో అంతమౌతుంది' అన్న అనుభవం మనస్సులో మెదులుతూనే వుంది. అందుకే కుశలవులమీదగూడా ప్రేమను, అనురాగ బంధాన్నీ ముదరనీయకుండా, బలపడకుండా వుంటున్నానిన్నీవల. మహారాజు శ్రీరామచంద్రులు వార్త పంపారు. యజ్ఞవాటిక సీత రావాలి, తన శీలం విషయంలో సత్యప్రతిజ్ఞ చెయ్యాలి అని. నేను మహర్షి ఆశ్ర యంలో వున్నాను మరి. మహర్షిగూడా అనుమతించారని విన్నాను. యజ్ఞ వాటికకు వెళ్ళాను.

తల ఎత్తి వారినెవరినీ చూడాలనిపించలేదు. సీత వచ్చింది; ఏం శపథం చేస్తుందో, ఏం శపథం చేస్తుందో అని కాచుక్కూచున్నారు. మహా రాజు, మరుదులు, మునులు, రుషులు, వానరులు, అందరూ. తలయెత్తి చూడలేకపోయినా— నిశ్శబ్దంవల్ల తెలుస్తోంది. శ్రీరామప్రభువు చూపులు తగులుకున్నై. తలయెత్తి చూచాను. అందరికీ నమస్కరించాను. "శ్రీరామ చంద్రులను కాక నేను మరెవ్వరినీ మనసా స్మరించలేదు; ఇదే సత్యమైతే- భూదేవి నాకు మార్గం కల్పించుగాక. మనస్సుతో, వాక్కుతో, పనులతో, నేను శ్రీరామచంద్రులనే పూజించాను. శ్రీరామచంద్రులను గాక మరెవ్వరినీ నేనెరుగను." అని అన్నాను. అంతే, నాకు తెలిసింది. తల్లి, భూమాత అనుగ్రహించింది. వివరం ఏర్పడింది. సింహాసనం వచ్చింది. నన్ను ఎక్కించుకుంది. అంతే. జీవిత నాటకం ముగిసింది.